క్లుప్తంగా

కల్యాణికి డాక్టరేట్



సంగెం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వాసం అనసూర్య-రవీందర్ దంపతుల కూతురు కల్యాణికి ఎకనామిక్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సావిత్రి పర్యవేక్షణలో కల్యాణి పరిశోధన పూర్తి చేశారు. 'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం అవకాశాలు, సవాళ్లు ' అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధన గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ కల్యాణికి డాక్టరేట్ ప్రదానం చేసింది. గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన కల్యాణి దేశంలోనే ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకోవడంపై గ్రామస్తులు స్నేహితులు కల్యాణిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

జయంతి ఉత్సవాలకు రూ.15వేల విరాళం



గీసుకొండ : అమరజీవి మద్దికాయల ఓంకార్ శతజయంతి ఉత్సవాల కోసం ప్రజాసేవకులు అల్లం బాలకిషోర్‌రెడ్డి రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. విరాళాన్ని అల్లం మల్రెడ్డి చేతుల మీదుగా గోనె కుమారస్వామి, మంద రవిలకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రడం భరత్, తిప్పారపు రవీందర్, బండి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ సమావేశం



పర్వతగిరి : బీజేపీ మండల కమిటీ సమావేశం ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చీమల భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలగం రంజిత్‌రావు(ఇన్‌చార్జ్) హాజరయ్యారు. ఈ సమావేశంలో పూర్తి మండల కమిటీ, వివిధ అనుబంధ సంఘాల కమిటీల నియామకం జరుగనున్న నేపథ్యంలో ఆశావాహుల పేర్లు తీసుకున్నామని మండల అధ్యక్షుడు భిక్షపతి తెలిపారు. తుది ఎంపిక జాబితా త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్‌కుమార్, సీనియర్ నాయకులు గూడెల్లి ప్రభాకర్, రంజిత్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, బొట్ల మధు, మారుతి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నర్సంపేట : మండలంలోని పాపయ్యపేటలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహ్మద్‌గౌడ్ పాషా, మహ్మద్ పాషాల తండ్రి సయ్యద్ అబ్దుల్ ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. పరామర్శించిన వారిలో ఉప్పరి వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్‌లు మేడి వెంకన్న, ఉప్పరి కనకయ్య, తాళ్ల సమ్మయ్య, అబ్బదాసి సుధాకర్, మొర్రి వీరస్వామి, మాజీ వార్డు సభ్యులు స్వామి, కొమురయ్య, యాకయ్య, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సందీప్, పెద్ద అశోక్, కుమార్, చిన్న, అశోక్, ప్రకాశ్ పాల్గొన్నారు.

మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు



ఖానాపురం : కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని కొత్తూరులో వారధి రైతు పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రావు, నర్సింహ నాయక్, పిండి కుమార్, నాంచారి కుమారస్వామి, వల్లె రవి, కోరె రాములు, పాల్గొన్నారు.

ఉనికి కోల్పోతున్న 'ఉపాధి'

- నగానికి నగం తగ్గిన పని దినాలు
- ఆందోళనలో కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దుగ్గొండి : దేశ వ్యాప్తంగా వలసలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం 2007 జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని తీసుకొచ్చింది. గ్రామీణ పేదలకు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించడంతో పాటు శాశ్వత అభివృద్ధి పనులు చేసుకునేలా చట్టాన్ని రూపొందించింది. దీంతో వలసలు 99 శాతం వరకు తగ్గిపోయాయి. అయితే ప్రజల మన్ననలు పొందిన ఉపాధి పథకానికి ప్రభుత్వాలు ఏటికి ఏడు కొర్రీలు పెడుతూ ఉపాధి పనిదినాలను తగ్గిస్తున్నారు. దీంతో మళ్లీ వలసలు మొదలు కానున్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దుగ్గొండి మండల పరిధిలో 10,600 జాబ్ కార్డులకు 8024 జాబ్‌కార్డులకు చెందిన 14,334 మంది కూలీలు పనికి వస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వం 2.68 లక్షల పనిదినాలు కేటాయించగా 2.89 లక్షల పనిదినాలు చేశారు. ఈ సారి సగం తగ్గించి 1.37 లక్షల పనిదినాలను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. గడిచిన 40 రోజుల్లో 55 వేల పనిదినాలు పూర్తయ్యాయి. మిగిలిన 80 వేల పనిదినాలతో 11 నెలల కాలం ఎలా గడపాలని ఉపాధి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పనిలేదంటే కూలీలు వినడం లేదు. వేలాది మంది పనికి వస్తే కేటాయించిన పనిదినాలు మే నెలలోనే గడిచిపోతాయి. ఇంకా జూన్, జులై మాసాల్లో హరిత హారం మొక్కలు ఎలా నాటాలి.. మొక్కల సంరక్షణ ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఇంకో వైపు వ్యవసాయ పనులు లేనందున అడిగిన ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాల్సిందేనని కూలీలు పట్టుబడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పనిదినాలు పెంచి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని పలువురు కూలీలు కోరుతున్నారు..

పనిదినాలు తగ్గిస్తున్నారు..



ఉపాధి పథకం అనేక మంది కూలీలకు ఆహార భద్రత కల్పిస్తుంది. చాలా వరకు వలసలు తగ్గిపోయాయి. పాలకులు కుట్ర పూరితంగా ప్రతియేటా పనిదినాలు తగ్గిస్తున్నారు. దీంతో కూలీలకు పనులు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. కల్పించిన పనిదినాలకు సైతం అనేక ఆంక్షలు పెడుతున్నారు. చెరువుల్లో పూడికతీతకు నిరాకరిస్తున్నారు. – ఈసంపల్లి బాబు. సీపీఎం జిల్లా నేత

ఉన్నతాధికారులకు వివరిస్తాం..



గత ఏడాది కంటే సగానికి ఉపాధి పని దినాలు తగ్గించడం వల్ల అవి మే నెల ఆఖరు వరకే సరిపోతాయి. జూన్ నుంచి మొదలు వచ్చే ఏడాది మార్చి 31 వరకు పని అడిగిన కూలీలకు ఎలా ఉపాధి కల్పించాలో తెలియడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. కూలీలకు న్యాయం జరిగేలా చూస్తాం. – శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీఓ, దుగ్గొండి

ఎట్టకేలకు ధాన్యం దిగుమతి

- పరిష్కరించిన డీఎం సంధ్యారాణి
- కోతలు లేకుండా రైతులకు న్యాయం

సాక్షి ఎఫెక్ట్..



రైతుల ధాన్యం శాంపిళ్లను పరిశీలిస్తున్న డీఎం సంధ్యారాణి, అధికారులు

ఖానాపురం : మండలంలోని బాల్‌తండాకు చెందిన ఐదుగురు రైతుల ధాన్యాన్ని నర్సంపేట మండలంలోని హరి ఇండస్ట్రీస్‌కు తీసుకెళ్లిన విషయం విధితమే. మిల్లర్ ధాన్యం సరిగాలేదని, కోతలు విధించి దిగుమతి చేసుకుంటామని ఒప్పందం చేసుకోగా సాక్షి దినపత్రికలో ఆదివారం 'ధాన్యం దిగుమతిలో తిరకాసు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, డీసీఓ కిష్టయ్య, క్వాలిటీ కంట్రోలర్ రాజయ్య, మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్, సివిల్ సప్లయీస్ డీటీ సంధ్యారాణిలు ఆదివారం ఉదయం నర్సంపేట మండలంలోని హరి ఇండస్ట్రీస్ చేరుకున్నారు. లారీలోని ధాన్యాన్ని తీసి మిల్లులో పరిశీలించారు. తేమశాతం సరిగానే ఉండగా ధాన్యంను బియ్యంగా మార్చి చూసే క్రమంలో కొంత మేర కలర్ మారుతున్నట్లు గ్రహించారు. దీంతో మిల్లర్‌తో అధికారులు మాట్లాడగా తాను దిగుమతి చేసుకోలేనని తెలిపారు. దీంతో ధాన్యం లారీని దుగ్గొండి మండలంలోని చలపర్తిలోని న్యూ ముబారక్ రైస్‌మిల్‌కు పంపారు. లారీలోని పూర్తిస్థాయి ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని సదరు మిల్లర్‌కు సూచించడంతో ఎట్టకేలకు ధాన్యం దిగుమతి జరిగింది. ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు పడాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించుకోవాలని డీఎం సంధ్యారాణి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మిల్లు వద్దే ఉండి ధాన్యాన్ని పరిశీలిస్తూ మిల్లర్లతో చర్చించి రైతులకు న్యాయం చేయించిన సివిల్‌సప్లయిస్ డీఎంతో పాటు ఇతర అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొనాయమాకుల రైతు వేదికలో సంగెం, గీసుకొండ మండలాలు, 15, 16, 17 డివిజన్లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పార్టీలతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రిల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా సీఎం సహాయనిధి పథకం ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా 1740 మందికి రూ.5 కోట్ల 65లక్షల 79 వేల 500లు ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రవీందర్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగాని సౌజన్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమురారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, కూసం రమేష్, దూల వెంకటేశ్వర్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించేందుకు బాలసంస్కార్



మాట్లాడుతున్న సౌమిత్ర లక్ష్మణాచార్యులు

పర్వతగిరి : విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి బాల సంస్కార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సౌమిత్ర లక్ష్మణాచార్యులు, తొర్రూరు వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వందేమాతరం రవీందర్‌రావు అన్నారు. మండలంలోని కల్లెడ శ్రీకొలను వేంకటేశ్వరస్వామి ఆలయంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న బాలసంస్కార్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వతగిరి శ్రీరామకృష్ణ సేవా సమితి, సహృదయ సేవా సమితి, కల్లెడ కొలను వేంకటేశ్వరస్వామి సేవక, ఆలయ నిర్వాహక బృందం ఆధ్వర్యంలో 15 రోజులుగా బాల సంస్కార్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. మనిషి జీవనాన్ని కొనసాగించడం అంటే లేనప్పుడు కూడా వారి గురించి మాట్లాడినప్పుడే నిజమైన జీవితాన్ని అనుభవించినట్లు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్, శ్రీరామకృష్ణ సేవా సమితి బాధ్యులు సురేందర్‌రావు, వేణుగోపాల్, రఘు, సహృదయ సేవా సమితి సభ్యులు ప్రాణాప్రతాప్, అనిల్, వినీత్, కొలను వేంకటేశ్వరస్వామి నిర్వాహక బృందం అజయ్, పర్వతగిరి శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు దయాకర్, సారంగపాణి, భాస్కర్, చంద్రశేఖర్, ప్రేమ్, ప్రసాద్, విష్ణు, దేవేందర్ పాల్గొన్నారు.

కార్యకర్తల కోసమే కొనుగోలు కేంద్రాలు

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఖానాపురం : సహకార చట్టాలకు తూట్లు పొడుస్తూ అర్హత లేకున్నా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల కోసమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు వస్తున్నాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లుగా ఉంటున్నారన్నారు. తొమ్మిది కొనుగోలు కేంద్రాలను మంజూరు చేస్తే కేవలం రెండు సంఘాలకు మాత్రమే అర్హత కలిగి ఉన్నాయని, మిగతా ఏడింటికి కనీస అర్హతలు లేవన్నారు. వారంలో సంఘంగా ఏర్పడిన వారికి కొనుగోలు కేంద్రం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల పేరుతో కాంగ్రెస్ నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆరేళ్ల సీనియారిటీ ఉన్న సంఘానికి కొనుగోలు కేంద్రం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా మంజూరు చేయడం సరికాదన్నారు. ధర్మరావుపేటలోని గణపతి సంఘానికి ఇచ్చిన కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, నాయకులు బందారపు శ్రీనివాస్, భూస అశోక్, మౌలానా, నరేందర్, నాగార్జున్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అంటుకోకుండా కాపాడిన పోలీసులు



సంగెం : మొన్నజొన్న చొప్ప తగలబెడితే మంటలు పక్కనున్న వరి ధాన్యానికి అంటుకోకుండా పోలీసులు కాపాడారు. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన అచ్చ దేవేందర్ తన చేనులోని మొక్కజొన్న వ్యర్థాలకు ఆదివారం సాయంత్రం నిప్పు పెట్టాడు. పక్కపొలంలో మద్దూరి వెంకటయ్యకు చెందిన వరి ధాన్యం కుప్ప, వరి గడ్డి ఉంది. గాలికి పక్కపొలంలోకి మంటలు పోవడాన్ని గమనించిన రైతు స్థానికులతో కలిసి మంటలు ఆర్పుతూ ఫైరింజన్, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంగెం పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుళ్లు కుమారస్వామి , అమీర్ బాబాలు వెళ్లి స్థానికులతో కలిసి ఫైరింజన్ వచ్చేలోగా పచ్చని చెట్టుకొమ్మలతో మంటలను ఆర్పివేశారు. దీంతో పక్కపొలంలోని వరి ధాన్యం తగలబడకుండా కాపాడగలిగారు. మంటలను అదుపులోకి తీసుకుని వచ్చిన కానిస్టేబుళ్లు, స్థానికులను గ్రామస్తులు అభినందించారు.

'భద్రకాళి'లో హోమం

హన్మకొండ కల్చరల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తవ్వాలని భారత సైన్యం, దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం శ్రీ భద్రకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, చండీహోమం నిర్వహించారు. ఈఓ శేషుభారతి ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు నాగరాజుశర్మ, అర్చకులు పర్యవేక్షకులు విజయ్‌కుమార్, హరినాథ్, అశోక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ యువకులు చైతన్యం కావాలి

- మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్



మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

నర్సంపేట : ముదిరాజ్ యువకులు చైతన్యం కావాలని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలో ఆదివారం ముదిరాజ్ యువకులతో ముఖాముఖి కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రానున్న కాలంలో రిజర్వేషన్ సాధించాలన్న, విద్యా అవకాశాలు పొందాలన్న యువతతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ అవకాశాల కోసం మెపా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో లింగగిరి గ్రామం యువత అందరికి ఆదర్శంగా ఐకమత్యంతో ముందుకెళ్తుందన్నారు. వీరిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాడేం రామచంద్రు, సాదబోయిన అశోక్, రంజిత్, కొత్తగూడెం మండల మెపా అధ్యక్షుడు అల్లాడి రాజు, శ్రీనివాస్, సందీప్, అనిల్, జయప్రకాశ్, దయ్యాల కృష్ణ, దేవేందర్, ప్రభాకర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత కల్పిస్తామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం జీడిగడ్డ తండాకు చెందిన బీజేపీ నాయకులు భూక్య హరీష్ అధ్యక్షతన కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు భూక్య వినోద్, మురళి, రాజేష్, నవీన్, భూక్య గణేష్‌లతో పాటు మరికొంత మంది బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన వారికి రాణాప్రతాప్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నీళ్ల బోనాలతో వెళ్తున్న గౌడకులస్తులు

ఖానాపురం : మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు వేడుకలను చేపట్టనున్నారు. నీళ్ల బోనాలతో మహిళలు, పురుషులు వెళ్లారు. కళాకారుల నృత్యాల మధ్య దేవాలయం వద్దకు వెళ్లి అభిషేకాలు చేపట్టారు. సోమవారం బోనాలను సమర్పించి కంఠమహేశ్వరస్వామి కల్యాణ వేడుకలను చేపట్టనున్నారు. దీంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. గౌడ సంఘం అధ్యక్షుడు గంగాపురం రమేష్, సంఘం బాధ్యులు మనోహర్, మేరుగు రాజు, తాళ్లపెల్లి రవి, తోటకూరి రాజు, ఎల్లగౌడ్, మేరుగు రవి, మచ్చిక అశోక్‌తో పాటు గౌడ కులస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ధాన్యం కుప్పలను తప్పించబోయి ఇద్దరికి తీవ్రగాయాలు




గాయపడిన రాములు, హైమ

రాయపర్తి : రహదారిపై పోసిన వరిధాన్యం కుప్పలను తప్పించబోయిన ఘటనలో టూవీలర్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొండూరులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొండూరుకు చెందిన ల్యాదెల్ల రాములు, ఆయన భార్య హైమ కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి వెళ్లి తిరిగి సొంత గ్రామానికి టూవీలర్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో రాయపర్తి మండలం బురహాన్‌పల్లి శివారులోని రహదారిపై ఉన్న వరిధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లిన టూవీలర్ కిందపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. రోడ్డుపై రైతులు ఇష్టారాజ్యంగా వరికుప్పలను పోయడంతో పలుమార్లు ప్రమాదాలు జరగడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని వెంటనే రోడ్డుపై పోసిన వరిధాన్యం కుప్పలను తొలగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్ డబ్బా మీద పడి వ్యక్తికి తీవ్రగాయాలు

ఖానాపురం : ట్రాక్టర్ డబ్బా ప్రమాదవశాత్తు మీద పడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొత్తూరు శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మరావుపేటకు చెందిన పోతరాజు మోహన్ తనకున్న ట్రాక్టర్‌తో కొత్తూరు శివారులో పనుల కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డబ్బాకు సంబంధించిన పైపు పగిలిపోవడంతో డబ్బాను జాకీతో పైకి లేపి కింద పైపును సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో పైపు పగిలిపోవడంతో ఒక్కసారిగా పైకి లేపి ఉన్న డబ్బా కిందకు వచ్చి మోహన్‌పై పడిపోయింది. డబ్బా మధ్యలో తల ఇరుక్కుపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే డబ్బాను తొలగించి ఇరుక్కుపోయిన మోహన్‌ను బయటకుతీసి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జయంతి



హోమంలో పాల్గొన్న భక్తులు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో సుదర్శన నరసింహ హోమం, స్వామివారికి శత కలశాభిషేకం, 108 కలశాలతో పంచామృత అభిషేకం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ సాయిలి రమాదేవి, ప్రభాకర్ దంపతులు, ధర్మకర్త శ్రీనివాసాచార్యులు, బొమ్మల రమేష్, వీరాటి స్వర్ణ రవీందర్ రెడ్డి, లింగారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రధాన పూజారులు రామాచార్యులు, అర్చకులు ఫణిందర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేశవాప్త సమ్మెను జయప్రదం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

దుగ్గొండి : ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి కోరారు. సీపీఎంఅనుబంధం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదివారం గిర్నిబావిలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బడా వ్యాపారస్తుల ప్రయోజనాలను కాపాడుతూ గ్రామీణ పేదలకు నష్టం కలిగిస్తుందన్నారు. ఉపాధి పథకాన్ని రోజు రోజుకు నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్ల నర్సింహారెడ్డి, అక్కపెల్లి సుధాకర్, కోడెం రమేష్ పాల్గొన్నారు.